

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

20

వెంకటేశ్వరరావు సేనోజోలోని న్యూ బెడ్‌ఫోర్డ్ కోర్ట్‌లోని 1520 నంబరు ఇంటిని కొన్నాడు. వాళ్ళు అందులోకి మారాక వాణి చిరునామాలోని మార్పుని ముకుందానికి తెలియచేసింది.

**రాజమండ్రి.**

**"డియర్ వాణీ!**

నీవు నో అంటే ఆత్మహత్య చేసుకోడానికి ఏర్పడ్డ క్యూలో నిలుచుని ఉన్నాను. నా జీవితకాలంలో ఈ కొండ శిఖరం మీద నుంచి దూకేసే అవకాశం వచ్చేటట్లుగా లేదు. చూశావా, ఇది రాసేలోగా నా వెనకాల క్యూ పదిమైళ్ళు పెరిగింది. మీ ఊరి గురించి, మీ ఇంటి గురించి, యూనివర్శిటీ గురించి రాయి.

**ముకుందం."**

వాణి సంగీతతో ముకుందం గురించి ప్రస్తావించింది. సంగీత అగ్గిరాముడి చేతిలో మోసపోయిన సంఘటన, తనే వాణి అనుకుని డబ్బా ఇంగ్లీష్ మాట్లాడిన సన్నివేశం గుర్తుచేసింది వాణికి. ఇద్దరూ నవ్వుకున్నారు.

**"డియరెస్ట్ ముకుందం,**

మా ఇంటి ఫొటోను జతచేస్తున్నాను. ఇక్కడి ఇళ్ళకి వాటి మోడల్స్‌ని బట్టి పేర్లుంటాయి. మా ఇల్లు వన్ అండ్ హాఫ్ స్టోరీ హౌస్. ఇంకా ‘మాన్ హౌస్, డ్యూప్లెక్స్, ట్యూడర్, మెడటరేనియన్స్, కొలోనియల్, రేంచ్ హౌస్, మొబైల్ హోమ్స్‘ ఇలా ఉంటాయి. బాగా మంచుపడే ప్రాంతాల్లోని ఇళ్ళల్లోనే గ్రీన్ రూమ్స్ వుంటాయి. అద్దాలతో చేసిన ఈ గదిలో మొక్కలు ఇంట్లోనే పెంచుకుంటారు. మంచుపడి అయిదారు నెలలు తెలుపు తప్ప, ఎక్కడా పచ్చదనం కనబడదు. కాబట్టి ఇంట్లో చెట్లను చూసి ఆనందించడానికన్నమాట వాటిని ఎంచేది.

సెయింట్ లూయిస్‌లోని మా యింటికి బేస్‌మెంట్ అంటే ఇంటికింద పెద్ద గది ఉండేది. శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెల్స్‌లలో భూకంపాల భయం అధికం కాబట్టి ఇక్కడ బేస్‌మెంట్స్ వుండవు. ప్రతి ఇంటి ముందు, లేదా వెనకో విధిగా లాన్‌ని పెంచుతారు.

మొబైల్ హోమ్స్ కింద చక్రాలుంటాయి. చూడటానికి మామూలు ఇళ్ళలా వుంటాయి తప్ప చక్రాలు కనిపించవు. ఈ మొబైల్ హోమ్స్ అన్నీ ఓ ప్రాంతంలో వుంటాయి. ఓ చోట నుంచి ఈ ఇళ్ళను వేరే చోటికి ట్రక్కులోకి ఎక్కించి తీసుకెళ్ళొచ్చు. అఫ్‌కోర్స్ వాటి ధర మామూలు ఇళ్ళకన్నా తక్కువ.

"మా ఊరి గురించి. శాన్‌ఫ్రాన్సిస్కో చాలా చక్కటి ఊరు. ఇక్కడ వున్న ఫిషర్‌మేన్స్ వార్ఫ్ ప్రతి టూరిస్ట్‌నీ ఆకర్షిస్తుంది. అది అవుట్ డోర్ కార్నివాల్‌లాంటిది. బఫూన్స్, మైమ్స్ చేసేవారు. డాన్స్ చూడచ్చు. గుర్రాలు లాగే అందమైన బగ్గీలు ఎక్కొచ్చు. ఫ్రెష్ సోర్ డఫ్ బ్రెడ్‌తోపాటు ఆవిరి కక్కే డర్జనెస్ క్రెబ్, కామ్‌చౌడర్ అమ్ముతారు. ఫ్రెష్‌సోర్ డఫ్‌ని శాన్‌ఫ్రాన్సిస్కో బ్రెడ్ అనీ కూడా అంటారు. చాలా రుచిగా వుంటుందది. నువ్విక్కడికి వచ్చాక మనం కలిసి తిందాం. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఓల్డెస్ట్ స్ట్రీట్ గ్రాంట్ అవెన్యూ. లాంగెస్ట్ స్ట్రీట్ మిషన్ స్ట్రీట్ - ఏడున్నర మైళ్ళ పొడవుగల వీధి అది. వైడెస్ట్ స్ట్రీట్ వేన్‌నెస్ అవెన్యూ - ఏడున్నర మైళ్ళ పొడవుగల వీధి అది. వైడెస్ట్ స్ట్రీట్ వెన్‌నెస్ అవెన్యూ - నూటపాతిక అడుగుల వెడల్పుంటుంది అది. నేరోయెస్ట్ స్ట్రీట్ డిఫారెస్ట్ స్ట్రీట్.. కేవలం నాలుగున్నర అడుగుల వెడల్పే ఉంటుంది. అతి స్టీపెస్ట్ స్ట్రీట్ కేవలం నాలుగున్నర అడుగుల వెడల్పే ఉంటుంది. అతి స్టీపెస్ట్ స్ట్రీట్ ఫిబ్బెర్టు స్ట్రీ - దాని గ్రేడియంట్ ముప్పై ఒకటిన్నర శాతం.

కొయిట్ టవర్ అనే ఎత్తైన ప్రదేశం మీద నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో సిటీ చూస్తే ఎంతో అందంగా కనపడుతుంది. మా ఊళ్ళో కేబుల్ కార్, అంటే ట్రామ్ వుంది. 1873లో ట్రామ్ వేసినప్పటినుంచి అవి నడుస్తునే ఉన్నాయి.

నైన్టీటన్ థర్టీ సెవెన్‌లో కట్టిన ఇక్కడున్న గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ గొప్ప టూరిస్ట్ అట్రాక్షన్. దీని ప్రత్యేకత బ్రిడ్జి మధ్యలో స్థంభాలు లేకపోవడం. అంటే సస్పెన్షన్ బ్రిడ్జి అన్నమాట. ఈ వేలాడే వంతెనకి అటు ఇటు నీటిపైన రెండువందల ఇరవై ఏడు మీటర్ల ఎత్తున్న స్థూపాల మధ్య ఉక్కు టేబుల్స్ అమర్చి నిర్మించారు. దీని పొడవు పన్నెండువందల ఇరవై మీటర్లు కలకత్తాలోని హౌరా బ్రిడ్జి కూడా గోల్డెన్ గేట్ బ్రిడ్జిలా సస్పెన్షన్ బ్రిడ్జే

ఇక్కడి ఘిరార్ డెల్లి స్క్వేర్ హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లా వ్యాపార కేంద్రం ఇక్కడున్న గెలార్డ్ అనే ఇండియన్ రెస్టారెంట్‌లో ఎప్పుడయినా భోజనానికి వెళ్తాం. దాని బ్రాంచ్‌లు బాంబేలో, ఢిల్లీలో కూడా ఉన్నాయి.

శాన్‌ఫ్రాన్సిస్కో, ఓక్‌లేండ్ జంటనగరాలు, వాటిని కలిపే బే బ్రిడ్జ్ మీద ఆరు కార్లు పక్కపక్కన వెళ్ళేంత విశాలమైనది.

ఇది అమెరికాలోని నాలుగో పెద్ద నగరం. చైనా దేశం బయట ఎక్కువమంది చైనీస్ జీవించేది ఇక్కడి చైనా టౌన్‌లోనే.

కేంపస్‌లో డ్రగ్స్ తీసుకునేవారు అధికం. ఇక్కడ కొందరు స్టూడెంట్స్ కలిసి చిన్న గేంగ్‌గా ఫార్మ్ అవుతారు. ఆ గేంగ్‌లో చేరడానికి ఇనీసియేషన్‌లాంటి ప్రొసీజర్స్ వుంటాయి. వాళ్ళ దొంగతనాలులాంటి చిన్న చిన్న నేరాలు మాత్రమే చేస్తూంటారు. వాళ్ళలా మారడానికి కారణం తల్లిదండ్రులే? తండ్రి ఎవరో తెలియకుండా పెరిగిన సింగిల్ పేరెంట్‌కి పుట్టినవాళ్ళు, విడాకులు తీసుకున్న తల్లిదండ్రులున్నవారు, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులచేత నిర్లక్ష్యం చేయబడ్డవారు, బాల్యంలో ఎలాంటి ప్రేమకూ నోచుకోనివారు సాధారణంగా ఇలాంటి గేంగ్స్‌లో చేరి నేరస్థులుగా మారుతారు. కొందరు రియలైజ్ అయి అందులోనుంచి విడిపోయినా, ఎక్కువమంది తర్వాత క్రిమినల్స్‌గా తయారయ్యే అవకాశం ఎక్కువ. అమెరికన్ ఫేమిలీ సిస్టమ్‌లోని పెద్ద లోపానికి ఈ గేంగ్స్ మంచి ఉదాహరణ అని నా ఉద్దేశం.

ఇక అసలు విషయం.

మన పెళ్ళి జరగగలిగేది మనిద్దరం ఓ దేశంలో వున్నప్పుడేగా? అంచేత నీవు అమెరికాకి రావడానికి బీటెన్ ట్రాక్ స్టూడెంట్‌గా రావడం. చదువు పూర్తయ్యేలోగా ఉద్యోగం వెతుక్కుని గ్రీన్ కార్డు సంపాదించి ఇక్కడ సెటిల్ అవుతుంటారు. తొంభైశాతం మంది ఆంధ్రులు ఇలా వచ్చినవాళ్ళే.

కాబట్టి నువ్వు ఇక్కడికి వచ్చి ఏ ఎం.బి.ఏనో చదువు. ఈలోగా నా స్కూలింగ్ కూడా పూర్తవుతుంది. అప్పుడు మన పెళ్ళికి ఎలాంటి అడ్డూ వుండదు."

ముకుందం ఆ ఉత్తరాన్ని చదివి బాపన్నకిచ్చి అతను చదివాక అడిగాడు.

"స్టూడెంట్‌గా అమెరికా వెళ్ళడం ఎలా?"

బాపన్నకి ఆ విషయాలన్నీ కొట్టిన పిండే కాబట్టి అనర్గళంగా చెప్పాడు ఆ వివరాలు.

"ఒరే లడ్డూ! జపాన్, చైనా, కొరియాల తర్వాత అమెరికన్ యూనివర్శిటీలకు వెళ్ళే విద్యార్థుల విషయంలో ఇండియా నాలుగో స్థానంలో వుంది. 'యునైటెడ్ స్టేట్స్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇన్ ఇండియా' ఇక్కడినుంచి వెళ్ళే విద్యార్థులకు సహాయం చేస్తుంది.

ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, మద్రాసులలోని కన్సులేట్స్‌లో వీటి శాఖలున్నాయి. మద్రాసులోని అమెరికన్ కన్సులేట్‌లోని ఈ బ్రాంచి సౌత్ ఇండియన్స్‌కి సహాయం చేస్తుంది.

మనకు కావలిసిన కోర్సును అందించే అమెరికన్ యూనివర్శిటీల జాబితాను యు.ఎస్.ఇ.ఎఫ్.ఐ నుంచి సంపాదించవచ్చు.

"మద్రాసు వెళితే వీళ్ళ లైబ్రరీ కేటలాగ్స్ తిరగేసి కేంపస్, కాస్టాఫ్ లివింగ్, ఫీజు, కరికులమ్, డిగ్రీ, ఎన్నేళ్ళు, లైబ్రరీ రీసెర్చ్, సౌకర్యాలు, డార్మిటరీ సౌకర్యంలాంటి వివరాలు అన్ని సంపాదించవచ్చు.

హార్వర్డ్, స్టేన్‌ఫోర్డ్, వాషింగ్‌టన్, యేల్, ప్రిన్స్‌టన్, డ్యూమ్ షికాగో, బ్రౌన్ రైస్, జార్జ్‌టౌన్, కేలిఫోర్నియాలాంటి పెద్ద యూనివర్శిటీలలో కాక, చిన్న ఊళ్ళోని చిన్న యూనివర్శిటీలలో సీటు రావడం తేలిక.

అలాంటి ఊళ్ళలో అమెరికన్ లైఫ్ స్టైల్‌కి అడ్జస్ట్ అవడం కూడా తేలికే. కనీసం మనం పది పదిహేను యూనివర్శిటీలకి అప్లయ్ చేయాలి. అప్లికేషన్ ఫారం రాగానే ఫిలప్ చేసి వాళ్ళడిగిన డాక్యుమెంట్స్, వివరాలతో పంపాలి. ఈలోగా మనం టోఫెల్, జిమేట్ పాసై తీరాలి.

కాబట్టి ముందు ఆ పరీక్షలకు కూర్చోడానికి అప్లికేషన్ ఫారమ్ తెప్పించు. అహమ్మదాబాద్‌లో వుంది ఆ ఆఫీసు. అడ్రస్ యిస్తాను"

బాపన్న చెప్పేది ఆసక్తిగా, శ్రద్ధగా వినసాగాడు ముకుందం. అతనికి అదంతా కొత్త.

"ముఖ్యమైన విషయం ఒకటుంది. చదువుకి, నివాసానికి, గ్రాసానికి అయ్యే ఖర్చుని మనం ఇండియా నుంచి తీసుకెళ్ళే పక్షంలోనే స్టూడెంట్ వీసా ఇస్తారు. అది పన్నెండు వేలనుంచి ఇరవైవేల డాలర్లదాకా వుంటుంది.

యూనివర్శిటీని బట్టీ ఆ మొత్తాన్ని రూపాయల్లో కట్టి రిజర్వ్ బేంక్‌నుంచి డాలర్స్ తీసుకోవాలి" "అంటే రూపాయల్లో ఎంత?"

"డాలర్ ముప్పయ్ రెండు రూపాయలనుకుంటే, పదిహేనువేల డాలర్లు నీకు కావాలనుకుంటే సుమారుగా నాలుగున్నర లక్షలరూపాయలపైనే అవుతుంది. టిక్కెట్ కాక"

"బాబోయ్ అంతే?"

"ఎడ్యుకేషన్‌కు కొన్ని బేంక్స్ ఋణాలిస్తాయి, అక్కడికెళ్ళాక పార్ట్‌టైమ్ పనిచేసి ఆ డబ్బు తీర్చేయవచ్చు.

ఇక్కడిలాగే అమెరికన్ యూనివర్శిటీల్లో కూడా అకడమిక్ ఇయర్ తొమ్మిదినెలలు. సెప్టెంబర్‌లో మొదలై జూన్‌తో పూర్తవుతుంది.

ఒక అకడమిక్ ఇయర్‌లో సగం భాగాన్ని సెమిస్టర్ అంటారు. అంటే పద్దెనిమిది వారాలనుకో, కొన్ని యూనివర్శిటీల్లో సెమిస్టర్ బదులు క్వార్టర్స్ పద్ధతి వుంటుంది. ఏడాది పొడుగూతా యూనివర్శిటీ పనిచేస్తుంది. ప్రతి క్యాలెండర్ ఇయర్‌ని నాలుగు క్వార్టర్స్‌గా భాగిస్తారు.

వేసవికాలం సెలవులు లేకుండా ఏడాది పొడుగూతా చదవాలి క్వార్టర్ పద్ధతిలో"

"అమెరికాలో స్టూడెంట్స్ సంపాదన గురించేమిటి?" అడిగాడు ముకుందం.

"అమెరికన్ యూనివర్శిటీలో చేరిన మొదటి ఆరునెలలదాకా అక్కడ పనిచేసేందుకు అనుమతి ఇవ్వరు. కాబట్టి చాలామంది మొదటి ఆరునెలలకి సరిపడే డబ్బు మాత్రమే డాలర్‌లలో అమెరికాకు తీసుకు వెళతారు.

మొదటి ఆరునెలలూ కష్టపడి చదివి హయ్యర్ డ్రిగ్రీ తెచ్చుకుంటే స్కాలర్‌షిప్‌ద్వారా, లేదా రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ లేదా టీచింగ్ అసిస్టెంట్‌షిప్ ద్వారా ట్యూషన్ ఫీజ్‌ను సంపాదించుకోవచ్చు. ఒకోసారి దాంతోపాటు మంత్లీ స్టయిఫండ్ కూడా రావచ్చు.

అక్కడ చదువు కూడా మన యూనివర్శిటీలతో పోలిస్తే తేలిక. ఒకే క్లాసు ప్రతిరోజూ రెండుమూడుసార్లు ఉంటుంది. మనం త్వరగా లేస్తామా, లేక ఆలస్యంగా నాలాంటి వాడిని బట్టి ఏ క్లాస్ కావాలో మనమే ఎన్నుకోవచ్చు.

సెమిస్టర్‌కి అయిదు సబ్జక్ట్‌లు చదవాలి. ప్రతి సబ్జక్ట్ వారానికి మూడు క్లాసులుంటాయి. ప్రతిక్లాసు యాభై నిముషాలుంటుంది. క్లాస్‌కి ఏభైనుంచి వందమంది విద్యార్థులు ఉంటారు.

ప్రతి యూనివర్శిటీకి లైబ్రరీ, లాబ్ ఆడియో విజువల్ ఎక్విప్‌మెంటు వుంటాయి. వాటిని మనం ఉపయోగించుకోవచ్చు"

"ఐ - ట్వంటీ గురించి చెప్పనేలేదు" అడిగాడు ముకుందం.

"అమెరికన్ యూనివర్శిటీ మనకు సీటు ఇవ్వడాన్ని ఐ - ట్వంటీ అంటారు. స్టూడెంట్ వీసాని ఎఫ్ -1 వీసా అని పిలుస్తారు. ఎఫ్ - 2 అంటే భార్యాపిల్లలతో వెళ్ళే స్టూడెంట్స్‌కి ఇచ్చే వీసా.

టోఫెల్ అంటే టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ఏజ్ ఫారిన్ లాంగ్వేజ్‌కి షార్ట్‌ఫాం. దీన్ని ప్రిన్స్‌టన్‌లోని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసు కండక్టు చేస్తుంది.

ఇండియాలో అలహాబాద్‌లో వుంది దీని బ్రాంచి. ముప్పై ఎనిమిదిడాలర్లు పరీక్ష ఫీజు. ఇంకా?" అడిగాడు బాపన్న.

"అమెరికాలో గదులు అద్దెకు దొరుకుతాయా?"

"చాలా యూనివర్శిటీలకి డార్మిటరీలు, హాస్టల్స్ వుంటాయి. ఇండియానుంచి వెళ్ళినవాళ్ళు నలుగురయిదుగురు కలిసి అపార్టుమెంట్‌ని అద్దెకు తీసుకుని ఉంటారు. ప్రతి యూనివర్శిటీకి ఫారిన్ స్టూడెంట్ అడ్వైజర్ ఉంటాడు. అలాగే గ్రాడ్యుయేట్ స్టడీ ప్రోగ్రాం అడ్వైజర్ కూడా సహాయం చేస్తారు. గది వెతుక్కోవడంలాంటి ఈతి బాధలు అక్కరలేదు. వాళ్ళే సహాయం చేస్తారు"

"ఇందాక అసిస్టెంట్‌షిప్ అన్నావు. అంటే ఏమిటి?"

"రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ అవకాశం దొరికితే ఓ ప్రొఫెసర్‌కి ఆయన చేసే రీసెర్చ్ వర్క్‌కి సహాయం చేయడం. రెండోది టీచింగ్ అసిస్టెంట్‌షిప్ ప్రొఫెసర్‌కి టీచింగ్‌లో సహాయం చేయడమన్నమాట ఇది ఈ రెండింటికీ టఫ్ కాంపిటేషన్ వుంటుంది. మంచి గ్రేడ్ రావడం ముఖ్యం"

"గ్రేడంటే?"

"మనకి మార్కుల్లాంటివి. మనం చదివిన చదువుని బేరీజు వేసి గ్రేడ్ ఇస్తారు. 'ఏ' గ్రేడ్ వస్తే బాగా చదివేశాడని అర్థం. 'బి' గ్రేడ్ అబౌ ఏవరేజ్ స్టూడెంట్‌కి ఇస్తారు. 'సి' అంటే ఏవరేజ్. 'డి'బిలో ఏవరేజ్ గ్రేడ్ 'డి' దాకా ఏ గ్రేడ్ వచ్చినా పాసవ్వచ్చు. తర్వాతి గ్రేడ్ 'ఎఫ్' వస్తే తప్పినట్లు ఇంకో గ్రేడ్ 'ఐ ఎన్.సి' అంటే 'ఇన్‌కంప్లీట్' అని అర్థం తమకిచ్చిన పనిని పూర్తిచేయనివారికి ఈ గ్రేడ్ వస్తుంది. అది పూర్తిచేశాక ఫెయిల్ లెటర్స్ గ్రేడ్‌లోని 'ఎ' నుంచి 'ఎఫ్' దాకా ఏదో ఒక గ్రేడ్ ఇస్తారు. ఇంకొకటి 'డి.ఇ.ఎఫ్' గ్రేడ్ అంటే డిఫర్డ్ అని ఇది వస్తే ఏ గ్రేడూ ఇవ్వకుండా విత్‌హెల్డ్ చేసినట్లు చివరిదాకా ఉండకుండా టెర్మ్ మధ్యలో విత్ డ్రా అయితే 'డబ్ల్యు ఐ' గ్రేడ్ యిస్తారు. ప్రతీ క్వార్టర్, లేదా సెమిస్టర్ చివర్లో పరీక్షలు పెడతారు."

ముకుందం ఆ రాత్రి ఆలోచించాడు. తను చదువుకి అమెరికా వెళ్ళే ఉద్దేశం అంతదాకా ముకుందానికి లేదు. తండ్రి వ్యాపారంలో సహాయం చేయాలన్నదే అతని తలంపు, కానీ వాణిని చేసుకోవాలంటే స్వదేశం వదిలి అమెరికా వెళ్ళిపోవాలి. తన తల్లిదండ్రులని, స్వదేశాన్ని విడిచి దూరంగా వెళ్ళడం తనకు సాధ్యమేనా?

ముకుందం ఆ విషయమ్మీద నాలుగయిదురోజులు మథనపడ్డాడు. ఎటూ నిర్ణయించుకోలేకపోయాడు. రాజమండ్రి వదలాలని లేదు. వాణికి దూరం అవ్వాలని లేదతనికి.

అణుబాంబుకన్నా శక్తివంతమైనది, భూకంపంకన్నా తీవ్రమయినది, సముద్రంకన్నా విశాలమైనది, కాంతికన్నా వేగమైనది ప్రేమ, ప్రేమంటూ ఓ మనిషి హృదయంలోకి ప్రవేశిస్తే అది పిరికివాడని సాహసిగా, అమాయకుడిని జ్ఞానిగా మార్చగలదు.

మనిషిని ఎలా కావాలంటే అలా మార్చే మహత్తు ప్రేమకి ఉంది.

అలాంటి ప్రేమముందు ముకుందం ఓ లెక్కా?

ప్రేమ చేసే మేజిక్‌కి అతను కూడా లొంగాడు. అమెరికాకి వెళ్ళి ఎం.బి.ఎలో చేరదలచుకున్నాడు.

నిజానికి వాణికోసం ముకుందం నిర్మానుష్యమైన, మంచుతో నిండిన అంటార్కిటికా ఖండానికి వెళ్ళమన్నా వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఆ నిర్ణయం తీసుకోగానే ముకుందం వాణికి ఓ ఉత్తరం రాశాడు.

"విద్యార్థిగా మీ దేశానికి వస్తాను. రోజూ ఉదయం నీకు 'గుడ్‌మార్నింగ్', రాత్రి 'గుడ్‌నైట్' చెప్పే అవకాశం కోసం ఏమి చేయాల్సి వచ్చినా అందుకు నేను సిద్ధమే."

ముకుందం వాణి గురించి మనసు విప్పి తన తల్లితో చెప్పాడు.

"నాన్నగారితో నువ్వు మాట్లాడమ్మా?" అందుకయ్యే ఖర్చు వివరాలు చెప్పి తల్లిని బతిమలాడాడు ముకుందం.

ఆవిడకి వాణి తన కోడలు అవడంలో ఎలాంటి అభ్యంతరమూ లేదు కాబట్టి తన భర్తతో ఆ రాత్రి వాణి గురించి భర్తకు చెప్పింది.

"వాళ్ళ కులం ఏమిటి? మన కులం ఏమిటి?" మళ్ళీ అభ్యంతరం చెప్పాడాయన.

భర్తకి నచ్చచెప్పడానికి ప్రయత్నించిందావిడ. కానీ విఠల్ తన పట్టు విడవలేదు.

ముకుందం తండ్రిని బతిమాలి, రెండురోజులు నిరహారదీక్ష చేశాడు.

"మనకున్న దొక్కటే కొడుకు. వాడి కోరిక తీర్చకపోతే ఏం లాభం?" అంటూ అనేక విధాలుగా ఆవిడ భర్తకి నచ్చచెప్పింది.

ఒక్కగానొక్క కొడుకు మాటను కాదనలేడు. అలా అని ఆ కోరికని అంగీకరించనూలేడు.

విఠల్ కూడా రెండురోజులు ఆ విషయం మీద ఓ నిర్ణయం తీసుకోలేకపోయాడు.

విఠల్ అమెరికాకి తన ముగ్గురు పిల్లల్ని పంపిన ఓ కాంట్రాక్టర్ దగ్గరకు సలహాకోసం వెళ్ళాడు. తన కొడుకు అమెరికా వెళ్ళి చదువుకుంటానని గొడవచేస్తున్నాడని, తనకు అందుకు ఇష్టంలేదని, తగిన సలహా యివ్వమని కోరాడు.

ఆయన చిన్నగా నవ్వి చెప్పాడు -

"ఏముందయ్యా యీ దేశంలో? ఎళతానంటే ఎళ్ళనీ"

"అలా అంటున్నారేమిటి?" అడిగాడు విఠల్ అర్థంకాక.

"అవునయ్యా! నాకు యింత ఆస్తిపాస్తులున్నా నేను నా పిల్లల్ని అక్కడికి ఎందుకు పంపించి సదివించానంటావ్? ఈ దేశంలో పెజలకి భవిష్యత్తు లేదయ్యా!

అవినీతి, అన్యాయం లేని సోటు లేదిక్కడ. మెరిట్ వున్నా, కట్టపడినా పైకి వచ్చే దేశం అమెరికా. ఇక్కడ ఆ రెండింటికీ ఇలువే లేదు. ఇన్‌ఫ్లుయెన్స్‌కి, డబ్బుకి, రాజకీయాలకి ఇలువిక్కడ. రాజకీయం నడిపి తోటివాణ్ణి అణగదొక్కి తను పైకి రావడం మనదేశంలో అందరికి బాగా అలవాటైన ఇద్య.

మంత్రికాడ్నించి, ఉద్యోగస్తుడి కాణ్ణించి, యాపారస్తుడికాణ్ణించి ఎవుడయినా సరే, తనమీద ప్లేసేసే పాలిటిక్స్ బారినపడకుండా తనను తాను కాపాడుకోవాల. అలాంటి పెజలం మనం. మనోళ్ళకి నాయం, ధర్మం ఏనాడో పోయాయి.

"ఇదిను. పూర్వం ఓ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ ఉన్నాడంటే ఆడి కొడుకుని ఐ.ఏ.ఎస్ సేయాలనుకునేవాడు. ఈ ఐ.పి.ఎస్. ఆఫీసరు వున్నాడంటే ఆడి కొడుకుని ఐ.పి.ఎస్ సేయాలనుకునేవాడు. ఇప్పుడో?

అమెరికాకి సదువుకు పంపించేసి ఆళ్ళక్కడే సెటిల్ అయ్యేలా సూస్తున్నారు. ఎందుకంటావ్? మేధావులయిన ఆళ్ళకి తెలుసు మనదేశం పెజలకి భవిష్యత్తు లేదని.

"ఎం.సెట్‌లో ఫస్ట్ వచ్చాడో, సచ్చాడే! ఆడిమీద పత్రాలు, పిటీషన్లూ, సివరికి ఆడు ఎందుకు ఫస్టొచ్చానా దేవుడా అని ఏడ్చి సావాలి. ఏం బావుకుంటాడయ్యా నీ కొడుకు ఈడుంటే? నామాటిని ఆడెళతానంటే శుభ్రంగా అమెరికాకి పంపేసెయ్"

"కానీ నాకు ఒక్కడే కొడుకు కదండీ? అందుకని వెరుస్తున్నాను"

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in